క్లుప్తంగా

శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలి



రేపల్లె రూరల్: పిరాట్లంక దళిత వాడకు చెందిన శ్మశాన వాటిక సమస్యను అధికారులు పరిష్కరించాలని గ్రామ ప్రజలు సోమవారం తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. 40 సంవత్సరాల క్రితం గ్రామంలోని దళితవాడకు కొంత స్థలాన్ని అప్పటి ప్రభుత్వం మంజూరు చేసిందని, అయితే చోటాయిపాలెంకు చెందిన కొంతమంది అగ్ర వర్ణాల వారు శ్మశాన వాటికను అన్యాక్రాంతం చేసేందుకు పూనుకున్నారని గ్రామ ప్రజలు తెలిపారు. కొన్ని సంవత్సరాల క్రితం శ్మశాన వాటికలోని మట్టిని తవ్వుకున్నారని, ఇదేమి అని ప్రశ్నించగా మెరకలు సరి చేసేందుకు తవ్వుతున్నామని తెలిపారని, దీంతో ఆ భూమి చెరువుగా మారిందన్నారు. సమస్యను పరిశీలించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వేసవి దాహార్తి తీర్చడానికి బోర్లు ఏర్పాటు



భట్టిప్రోలు (కొల్లూరు) : వేసవిలో ప్రజల తాగునీటి కష్టాలను తొలగించేందుకు భట్టిప్రోలులో నూతనంగా మంచినీటి బోర్లు, ఫిల్టర్ పాయింట్‌ల ఏర్పాటు చేపట్టినట్లు భట్టిప్రోలు సర్పంచి ధార రవికిరణ్‌మై సోమవారం తెలిపారు. మండల కేంద్రం భట్టిప్రోలులో గతంలో ఏర్పాటు చేసిన బోర్లు వేసవి దృష్ట్యా భూగర్భ జలాలు అడుగంటి తాగునీరు అందించలేకపోవడంతో, నూతనంగా భట్టిప్రోలు రెవెన్యూ కార్యాలయం, పోలీసు స్టేషన్‌ల ప్రాంతాలలో రెండు బోర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు వేసవిలో నీటి కష్టాలకు గురవ్వరాదన్న సంకల్పంతో బోర్లు ఏర్పాటు చేసినట్లు సర్పంచి తెలిపారు. ఈ సందర్భంగా బోర్లు ఏర్పాటు పనులను సర్పంచి ధార రవికిరణ్‌మైచెన్నయ్య, పంచాయతీ కార్యదర్శి కోటా శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పరిశీలించారు.

పదిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు



అమర్తలూరు(వేమూరు): పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించడం జరుగుతుందని ప్రధానోపాధ్యాయుడు కనపర్తి నిరీక్షణరావు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు సోమవారం అందజేయడం జరిగింది. 500 కంటే ఎక్కువ మార్కులు సాధించిన 11 మందిని సత్కరించడం జరిగిందన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి గడ్డిపాటి ప్రభాకరరావు 11 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరిగడ్డి వామి దగ్ధం



కర్లపాలెం: మండల పరిధిలోని యాజలి గ్రామంలో వరిగడ్డి వామి దగ్ధమైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వీఆర్వో యశ్వంతి తెలిపిన వివరాల మేరకు గ్రామంలోని ఏలూరి పవన్‌కుమార్‌కు చెందిన ఏడు ఎకరాల వరిగడ్డి వామిలో ఒక్కసారిగా మంటలు ఎగసి దగ్ధమైంది. బాపట్ల ఫైర్ ఇంజన్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసినట్లు ఆమె తెలిపారు. ఆస్తి నష్టం సుమారు రూ.70 వేల వరకు ఉంటుందని ప్రమాదం జరగటానికి కారణాలు తెలియలేదని చెప్పారు.

ప్రయాణికుడిపై దాడి, దోపిడీ

తెనాలిరూరల్: ప్రయాణికుడిని నమ్మించి అతనిపై దాడి చేసి సెల్‌ఫోన్, నగదు అపహరించి దుండగు లు ఉడాయించారు. సేకరించిన వివరాల ప్రకారం బాపట్ల జిల్లా కొల్లూరుకు చెందిన పి. శివప్రసాద్ ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి తెనాలి వచ్చాడు. కొల్లూరు వెళ్లేందుకు బస్టాండ్ వద్ద వేచి ఉండగా ఇరువురు వ్యక్తులు బైక్‌పై వచ్చి తాము కూడా కొల్లూరు వెళ్తున్నట్లు నమ్మించారు. వారి మాటలు నమ్మి శివప్రసాద్ వారి ద్విచక్ర వాహనంపై ఎక్కాడు. కూచిపూడి లాకుల వరకు వెళ్లిన తర్వా త ఇరువురు దుండగులు శివప్రసాద్‌పై దాడి చేసి, అతని వద్ద నగదు, సెల్‌ఫోన్ లాక్కున్నారు. ప్రతిఘటించే ప్రయత్నం చేసిన శివప్రసాద్‌ని పక్కనే ఉన్న కాలువలోకి నెట్టి పరారయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి బాధితుడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విచారణ చేపట్టారు.

జోరుగా తవ్వకాలు.. పట్టించుకోని అధికారులు

- వారం రోజులుగా కూచిపూడిలో మట్టి తవ్వకాలు
- అనుమతి లేకుండానే చేపట్టిన వైనం



కూచిపూడి గ్రామంలో మట్టి తవ్వకాలు

అమర్తలూరు(వేమూరు): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. వేమూరు నియోజకవర్గంలోని అమర్తలూరు మండలం కూచిపూడి గ్రామంలో చేపల చెరువు చేసేందుకు మట్టి తవ్వకం చేపట్టి ఇతర గ్రామాలకు తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రభుత్వ అనుమతి పొంది మట్టి తవ్వకాలు చేపట్టాలి, కానీ కూటమి ప్రభుత్వంలో అధికారుల అనుమతులు లేకుండానే మట్టి తవ్వకాలు జోరుగా జరుగుతున్నా.. రెవెన్యూ, పోలీసులు శాఖ పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు చేపడితే వెంటనే నిలిపి వేయడం జరిగిందని, వారం రోజుల నుంచి మట్టి తవ్వకం జోరుగా సాగుతున్నా పట్టించుకునే వారే లేరని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

మోపర్రు గ్రామంలోనూ...

కూచిపూడి గ్రామంలో మట్టి తవ్వకాల్లో రెవెన్యూ అధికారులు పైసలు తీసుకోవడంతోనే పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రైతులు పొలంలో మట్టి తవ్వకాలు చేస్తే వెంటనే రెవెన్యూ అధికారులు అడ్డుకొని మైనింగ్ అనుమతి పొందాలని నిలిపి వేయడం జరుగుతుందని, కానీ కూచిపూడి గ్రామంలో వారం రోజుల నుంచి యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో ఉన్న వీఆర్వో కూడా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు. అలాగే మండలంలోని మోపర్రు గ్రామంలో కూడా మట్టి తవ్వకాలు చేపట్టారు.

మట్టి తవ్వకాలు నిలిపి వేయాలి



ప్రభుత్వ అనుమతి లేకుండా చేపట్టిన మట్టి తవ్వకాలను వెంటనే నిలిపి వేయాలి. చేపల చెరువు కోసం అని మట్టి తవ్వకాలు చేపట్టారు. మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. మైనింగ్ అధికారుల అనుమతి పొందాలి.

– బొనిగల అగస్టీన్, సీపీఎం నాయకుడు, వేమూరు

అధికారులు పట్టించుకోవడం లేదు



గ్రామాల్లో మట్టి తవ్వకాలు చేపట్టారు. రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వంలో మట్టి తవ్వకాలు ప్రారంభిస్తే రెవెన్యూ అధికారులు, పోలీసులు నిలిపి వేయడం జరిగింది. ఈ ప్రభుత్వంలో అధికారులు పట్టించుకోవడం లేదు.

– పోతర్లంక సురేష్, అమర్తలూరు

ప్రధాని మోదీ పర్యటన విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

వేమూరు: ప్రధానమంత్రి మోదీ పర్యటనను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే నెల 2వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన విజయవంతం చేసేందుకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను ఇన్‌చార్జిగా నియమించడం జరిగిందన్నారు. ఉదయగిరి ఎమ్మెల్యే సురేష్ మాట్లాడుతూ ప్రధాని మోదీ పర్యటన విజయంతం చేసేందుకు ప్రతి ఒక్కరి సహకారం పూర్తిగా ఉండాలని తెలిపారు. అనంతరం జమ్మూకశ్మీర్లో ఉగ్ర వాద దాడికి చింతిస్తూ మౌనం పాటించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి, జొన్నలగడ్డ విజయబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేయాలి ఎంపీడీవో నాగలక్ష్మి



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో నాగలక్ష్మి

నిజాంపట్నం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనను విజయవంతం చేయాలని ఎంపీడీవో నాగలక్ష్మి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆమె పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మే 2న ప్రధాని నరేంద్ర మోదీ రాజధాని అమరావతికి విచేస్తున్నారన్నారు. ప్రధాని పర్యటనను విజయవంతం చేసేందుకు జన సమీకరణకు మండలానికి ఏడు బస్సులు కేటాయించడం జరిగిందన్నారు. ఒక్కొక్క బస్సులో 50 మంది ప్రజలతో పాటు డ్వాక్రా మహిళలు ఉండేలా ప్రణాళికలు చేసుకోవాలన్నారు. బస్సుల్లో వచ్చే ప్రజలకు భోజనం, తాగునీరు కల్పించాలన్నారు. ప్రతి బస్సులో వేసవిని దృష్టిలో ఉంచుకొని ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు ఏఎన్ఎంలు అందుబాటులో ఉండాలన్నారు. పర్యటన ముగిసి ప్రజలు సురక్షితంగా గ్రామాలకు చేరే వరకు కార్యదర్శులు బాధ్యత వహించాలని ఆదేశించారు.

సమస్యల పరిష్కార వేదికకు 12 అర్జీలు

రేపల్లె రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 12 అర్జీలు అందినట్లు ఆర్డీవో నేలపు రామలక్ష్మి తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి అనంతరం మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారం కోరుతూ 3, స్థలం ఆక్రమణల సమస్యలను పరిష్కరించాలని 5, రహదారి విస్తరణలో కోల్పోయిన స్థలానికి నష్టపరిహారం అందించాలని ఒక అర్జీ, స్థలం సర్వేకు ఒక అర్జీ, కొల్లూరులో నివాస గృహాల మధ్య అనుమతి లేకుండా తయారుచేస్తున్న ఇటుక బట్టీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఒక అర్జీ, ఓలేరు రహదారికి ఇరువైపుల అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించాలని ఒక అర్జీ వచ్చాయన్నారు. ఆయా శాఖల అధికారులు అర్జీలను పరిశీలించి పరిష్కరిస్తారని పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో వరిగడ్డి దగ్ధం



ఖాజీపాలెం(కర్లపాలెం): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వరిగడ్డి దగ్ధమైన ఘటన ఆదివారం రాత్రి పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానిక వీఆర్వో నాగరాజురెడ్డి తెలిపిన వివరాల మేరకు ఖాజీపాలెం పంచాయతీ మండేవారిపాలెం గ్రామానికి చెందిన కాగిత పోలు, నగరం మండలం సిరిపూడి గ్రామం నుంచి రెండు ఎకరాల వరిగడ్డి కొనుగోలు చేసి ట్రాక్టర్‌లో తమ గ్రామానికి తీసుకువస్తుండగా ఖాజీపాలెం వచ్చిన తరువాత ట్రాక్టర్‌లో ఉన్న వరిగడ్డికి విద్యుత్ తీగలు తగలటంతో వరిగడ్డిలో మంటలు ఎగశాయి. డ్రైవర్ సమయస్ఫూర్తిగా వ్యవహరించి ట్రాక్టర్‌ను పొలాల్లోకి తీసుకువెళ్లి గడ్డిని నేలపై పడవేయటంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. వరిగడ్డి కాలిపోవటంతో సుమారు రూ.20 వేల ఆస్తి నష్టం జరిగినట్లు వీఆర్వో తెలిపారు.

జిల్లా వైద్యశాలలో గుండెనొప్పికి ప్రథమ చికిత్స

డాక్టర్ రామకృష్ణన్, ఎయిమ్స్ కార్డియాలజిస్ట్



వైద్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న డాక్టర్ రామకృష్ణన్

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో గుండెనొప్పికి సంబంధించిన ప్రథమ చికిత్సను అందిస్తున్నట్లు, అవసరమైన వారు ఈ సేవలను ఉపయోగించుకోవాలని ఢిల్లీలోని ఎయిమ్స్ వైద్యశాల కార్డియాలజిస్ట్ డాక్టర్ రామకృష్ణన్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసర్చ్ ప్రతినిధి (ఐసీఎంఆర్) డాక్టర్ మీనాక్షి శర్మలు పేర్కొన్నారు. తెనాలి జిల్లా వైద్యశాలకు సోమవారం సాయంత్రం వారు పరిశీలించారు. ఇప్పటి వరకు గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులకు అందించిన సేవలపై ఆరా తీశారు. అలాగే రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి మాట్లాడుతూ 2023 ఆగస్టులో గుండెనొప్పి భారీనా పడిన రోగులకు ప్రథమ చికిత్స అందించడం జరుగుతుందన్నారు. అనంతరం వారిని గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలలకు పంపిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 60 మంది రోగులకు రూ.30వేలు విలువచేసే ఇంజక్షన్‌ను ఉచితంగా చేసినట్లు చెప్పారు. దీనివలన గుండె వాల్స్‌లో పేరుకుపోయిన క్లాట్‌లు కరిగే అవకాశం ఉందన్నారు. కారయక్రమంలో పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులకు జరిమానా

తెనాలిరూరల్: గంజాయి కేసులో నిందితులకు జరిమాని విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. తెనాలి రూరల్ సీఐ ఎ.అశోక్‌కుమార్, ఎస్ఐ ఎం.మురళి 2020లో పట్టణానికి చెందిన షేక్ నాగూరా, బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం పల్లపట్ల గ్రామానికి చెందిన గంగుల దుర్గాప్రసాద్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి500 గ్రాముల గంజాయి స్వా. దీనం చేసుకున్నా రు. నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. కేసు సోమవారం విచారణకు రావడంతో సాక్షాధారాలను పరిశీలించి రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ పి. రాజశేఖర్ నిందితులిద్దరికీ ఐదు వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్ వాదించారు.

విలువైన పశుదాణా వితరణ



గోవులకు దాణ సమర్పించిన మానవత బాధ్యులు

తెనాలి: ఆపదలో వున్న వారికి, అవసరమైన ప్రజలకు తమ సేవలను అందిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ మానవత, తెనాలి శాఖ పశువులకూ తోడ్పాటును అందించాలని నిర్ణయించింది. పట్టణ బుర్రిపాలెంరోడ్డులోని గోశాలలోని ఆవులకు ఒక్కొక్కటి రూ.550 చొప్పున రూ.55 వేల విలువైన వంద బ్యాగుల పశువుల దాణాను సోమవారం సాయంత్రం అందజేశారు. నెలరోజులపాటు ఆవులకు దాణా ఉపకరిస్తుందని చెప్పారు. సంస్థ రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం సూచనకు అనుగుణంగా తక్షణం స్పందించిన సభ్యుల సహకారంతో ఈ గోసేవను చేయగలిగినట్టు మానవత, తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ చెప్పారు. గోశాలలోని ఆవుల సంరక్షణ బాధ్యతలను నిర్వర్తిస్తున్న ప్రకాష్ జైన్, గోసంరక్షణ సంఘం సభ్యులు, వారికి సహకరిస్తున్న కుటుంబ సభ్యులను అభినందించారు. మానవత, తెనాలి ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ఓంకార్ ప్రసాద్ మాట్లాడుతూ మానవత సంస్థ అవసరమైన సేవాకార్యక్రమాలు చేపట్టడంలో ముందంజలో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి పి.వెంకట్, ఉపాధ్యక్షుడు పి.వాసు, సంయుక్త కార్యదర్శి డీవీ సోమయ్య శాస్త్రి, ఎస్వీ శర్మ, జొన్నాదలు నరసింహారావు, జీఎస్‌బీ ప్రభాకర్, సీహెచ్ సాంబశివరావు, మల్లాది అర్జున్, రోహిణి, కె.మదన్‌మోహన్, పి.మల్లికార్జున, భుజంగరావు, యు. సూర్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పీ-4 సర్వేలో బంగారు కుటుంబాల గుర్తింపు



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

కర్లపాలెం: ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన పీ-4 సర్వేలో మండలంలో మొత్తం 2,291 బంగారు కుటుంబాలను (నిరుపేద కుటుంబాలను) గుర్తించటం జరిగిందని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వీఆర్వోలు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎంపీడీవో మాట్లాడుతూ బంగారు కుటుంబాల అభ్యున్నతికి ప్రభుత్వం మార్గదర్శులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వ్యాపారస్తులు, పారిశ్రామిక వేత్తలు, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఆర్థికంగా స్థిరపడిన వారు, విదేశాల నుంచి వచ్చిన వారిని గుర్తించి వారిలో సేవాభావం కలిగిన వారిని మార్గదర్శులుగా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఐదు బంగారు కుటుంబాలకు ఒకరిని మార్గదర్శిగా నియమిస్తారని చెప్పారు. వీరు బంగారు కుటుంబాలకు సూచనలు, సలహాలు అందజేసి ఆ కుటుంబాల అభివృద్ధికి కృషి చేయాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసులురెడ్డి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించేలా చూడండి



తెనాలిఅర్బన్: తన కుమార్తె ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతుందని, ఆమెకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చేలా చూడాలని తెనాలికి చెందిన ఒక మహిళా కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. అలాగే బీసీ కార్పొరేషన్ రుణాన్ని మంజూరు చేయాలని, రామలింగేశ్వర పేటలో మురుగు కాల్వలు నిర్మించాలని, మంచి నీటి పంపులు వేయాలని, 14వ వార్డులో కొత్త రోడ్డు నిర్మించాలని పలువురు అసిస్టెంట్ సిటీ ప్లానర్ వాణికి వినతిపత్రాలు ఇచ్చారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్ సాంబశివరావుకు వినతి పత్రం అందజేస్తున్న జగనన్న కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు

రేపల్లె రూరల్: రేపల్లె పట్టణంలోని జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం మున్సిపల్ కమిషనర్ సాంబశివరావుకు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ మాట్లాడుతూ జగనన్న కాలనీలో 1,100 కుటుంబాలకు పైగా గృహాలను నిర్మించుకుని నివాసముంటున్నారని, కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రహదారులు, మురుగు కాలువలు లేక మురుగునీరు రహదారిపైకి చేరుతుందన్నారు. పైపులైన్లు లేకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కనీసం ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందించాలని కోరారు. కాలనీలో వీధిలైట్లు ఏర్పాటు చేసి కనీస అవసరాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ కన్వీనర్ వి.ధనమ్మ, కో కన్వీనర్ రవికుమార్, సహాయ కార్యదర్శి నాంచారమ్మ, సీపీఎం నాయకులు కె.ఆశీర్వాదం, డి.అగస్టీన్ పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలతో చిన్నారులకు విజ్ఞానం పెంపుదల



కొల్లూరు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభ కార్యక్రమం



అనంతవరం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభ కార్యక్రమం

కొల్లూరు : వేసవి విజ్ఞాన శిబిరాలతో చిన్నారులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి వెసులుబాటు ఉంటుందని గ్రంథాలయ విజ్ఞాన శిబిరం ప్రారంభోత్సవంలో వక్తలు అన్నారు. సోమవారం కొల్లూరు శాఖా గ్రంథాలయంతో పాటు, మండలంలోని అనంతవరం శాఖా గ్రంథాలయంలో చిన్నారులు జ్ఞాన సముపార్జన కోసం గ్రంథాలయ సంస్థ ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాలను ప్రారంభించారు. కొల్లూరులో టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, అనంతవరం కమ్యూనిటీ హెల్త్ అధికారి గోరికపూడి విజయ సరస్వతీ దేవి విగ్రహాలకు పూలమాలలు వేసి దీపారాధనతో కార్యక్రమాలను ఆరంభించారు. ఈ సందర్భంగా జూన్ 6 వరకు నిర్వహించే శిబిరాలలో భాగంగా విద్యార్థులకు చదువుతోపాటు, ఆటలు, పాటలు, యోగ, స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహించడంతోపాటు, కథలు, చిత్రలేఖనం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారులు వై.రాంబాబు, జి. కనకదుర్గ తెలిపారు.

ధూళిపాళ్ల అందరికీ ఆదర్శప్రాయుడు

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి

కొల్లూరు : పేద, బడుగు, బలహీన వర్గాలు చదువుకోవడం ద్వారానే ఉన్నత స్థానాలకు చేరుకోగలరని నమ్మి, వారి విద్యాభ్యాసానికి సహాయ, సహకారాలు అందించిన ధూళిపాళ్ల సుబ్బారావు అందరికీ ఆదర్శప్రాయుడని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి అన్నారు. మండలంలోని అనంతవరంకు చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు ధూళిపాళ్ల సుబ్బారావు మొదటి వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. దూళిపాళ్ల సుబ్బారావు వెనుకబడిన వర్గాల వారి చదువు కోసం పాటుపడటమే కాకుండా ఆయన మరణించిన అనంతరం తన మృతదేహాన్ని మెడికల్ కళాశాలకు ఇచ్చి వైద్య విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడి పలువురికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. సీపీఎం మండల కార్యదర్శి వేములపల్లి వెంకట్రామయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత ధూళిపాళ్ల సుబ్బారావు స్మారక స్థూపం వద్ద నివాళులు అర్పించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు టి.కృష్ణమోహన్, తెనాలి ప్రజా వైద్యశాల వైద్య నిపుణులు భీమవరపు సాంబిరెడ్డి, సీపీఎం నాయకులు బి.అగస్టీన్, జెట్టి బాలరాజు, ములక శివసాంబిరెడ్డి, బొనిగల సుబ్బారావు, టి.సురేష్, పి.నాగమల్లేశ్వరరావు, గొల్ల రాంబాబు, కనపర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో ఉపాధి అవకాశాలు

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష విద్యార్థులకు అవగాహన సదస్సులో ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి



మాట్లాడుతున్న ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి

తెనాలి: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవటం ద్వారా ఉపాధి అవకాశాలను పొందవచ్చని దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి అన్నారు. పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష ఈనెల 30వ తేదీన జరగనున్న సందర్భంగా స్థానిక ప్రకాశం రోడ్డులోని జేవీఎస్ క్రాంతి కోచింగ్ సెంటరు ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు మాక్ పరీక్ష నిర్వహించిన, అవగాహన సదస్సును ఏర్పాటుచేశారు. 215 మంది విద్యార్థినీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. మాక్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి నగదును బహూకరించారు. సదస్సులో ముఖ్యఅతిథి ఆచార్య కృపాచారి మాట్లాడుతూ ప్రవేశపరీక్షల్లో గట్టెక్కేందుకు విద్యార్థులు తీసుకోవాలన్సిన జాగ్రత్తలను సూచించారు. కోచింగ్ సెంటర్ డైరెక్టర్ జెట్టి విజయశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టమైనప్పటికీ ఇష్టంతో పోటీపరీక్షలకు తయారైనప్పుడే విజయం సాధించగలరని చెప్పారు. రమేష్‌రెడ్డి, రవి, రాంబాబు, ధర్మారావు, సూర్య, గణేష్, పద్మ పాల్గొన్నారు.

ఆటపాటలతో కూడిన విజ్ఞానాన్ని అందించాలి



వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న పంచాయితీ కార్యదర్శి హేమకుమారి

తెనాలిటౌన్: ఆటపాటలతో కూడిన విజ్ఞానాన్ని విద్యార్థులకు అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని నందివెలుగు పంచాయతీ కార్యదర్శి బి.హేమకుమారి సూచించారు. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో శాఖాగ్రంథాలయం ఆధ్వ ర్యంలో సోమవారం సమ్మర్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పంచాయతీ కార్యదర్శి బి.హేమకుమారి పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి నుంచి జూన్ 6వ తేదీ వరకు అన్ని శాఖాగ్రంథాలయాల్లో విద్యార్థుల కోసం వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం ముదావహమని పేర్కొన్నారు. ఆటపాటలతో కూడిన విజ్ఞానాన్ని నేటి చిన్నారులకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వెల్లడించారు. సమ్మర్ క్యాంప్‌లో డ్రాయింగ్, ఎస్‌ఏ రైటింగ్, స్టోరి రీడింగ్, ఇండోర్ గేమ్స్, స్పోకెన్ ఇంగ్లీషు, పేపర్ క్రాఫ్ట్స్ ఎస్‌ఏ రైటింగ్, వివిధ రకాల కాంపిటీషన్లు ఉంటాయని చెప్పారు. విద్యార్థులు శ్రద్ధతో వీటన్నింటినీ నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి బి.మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలిరూరల్: మండలంలోని సంగంజాగర్లమూడిలో గల శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులుసోమవారం ప్రారంభమయ్యాయి. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు డి. విశ్వనాథ్ తరగతులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శిక్షణ తరగతులను వినియోగించుకొని మంచి విజ్ఞానాన్ని పొందాలని బాలలకు సూచించారు. జూన్ 6వ తేదీ వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని గ్రంథాలయాధికారి జె. వెంకటేశ్వరరావు తెలిపారు. తరగతులకు వచ్చిన బాలలతో నీతి కథలు చదివించి చెప్పించారు.